తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
వరంగల్ - ఆదిలాబాద్
హన్మకొండ | జనగాం | ములుగు  నిర్మల్ | మంచిర్యాల
జ్రో॥ జయశంకర్ భూపాలపల్లి  కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్
ఆదివారం
5 జూలై 2026
పేజీలు - 8



## ఎంటిటీఎస్ శిక్షణ శిబిరాన్ని పూర్తి చేసుకున్న సాత్వికకు అభినందనలు

హనుమకొండ ప్రతినిధి జులై 4 (జనం సాక్షి) : జాతీయ ఉన్నత గణిత మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన గణిత ప్రతిభా వికాస శిక్షణ శిబిరం కు యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు చెందిన తుది సంవత్సరం విద్యార్థిని సాత్విక ఎంపికైంది. దేశవ్యాప్తంగా 40 మంది విద్యార్థులను ఎంపిక చేసిన ఈ శిబిరానికి తెలంగాణ నుంచి ఇద్దరు ఎంపిక కాగా, వారిలో సాత్విక ఒకరు. కేరళలోని తిరువనంతపురంలో నెలరోజుల పాటు గణితశాస్త్ర ప్రాథమిక అంశాలతో పాటు బీజగణితం, వాస్తవ విశ్లేషణకు సంబంధించిన అంశాలను ప్రముఖ అధ్యాపకులు బోధించారు. శిక్షణ శిబిరాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని తిరిగి వచ్చిన సాత్వికను కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జ్యోతి అభినందించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, గణితశాస్త్ర విభాగాధిపతి నాగయ్య, అధ్యాపకులు రవికుమార్, మంజుల, శ్రీలక్ష్మి, మౌనిక తదితరులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# రైతు భరోసాతో రైతుల జీవితాలలో వెలుగులు

- **175.23 కోట్ల రూపాయలతో 1 లక్ష 19 వేల 979 మంది రైతు కుటుంబాలకు అండగా నిలిచిన తెలంగాణ ప్రభుత్వం**

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 04(జనంసాక్షి ):** వ్యవసాయం కేవలం వృత్తి మాత్రమే కాదు, వేలాది కుటుంబాల జీవనాధారం. అలాంటి రైతు కుటుంబాలకు ప్రతి పంట సీజన్‌లో ఆర్థిక ధైర్యాన్ని అందిస్తూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో మరోసారి విజయవంతమైంది. వానాకాలం--2026 సీజన్‌లో జిల్లాలోని 1,19,979 మంది రైతుల ఖాతాల్లో 175.23 కోట్ల రూపాయల ఆర్థిక సహాయం నేరుగా జమ కావడంతో రైతు కుటుంబాలలో ఆనందం వెల్లివిరిసింది. ఒకప్పుడు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితుల్లో ఉన్న రైతులకు ఇప్పుడు సీజన్ ప్రారంభానికి ముందే ప్రభుత్వం నేరుగా పెట్టుబడి సహాయాన్ని అందించడం వల్ల వ్యవసాయ పనులు ఆలస్యం కాకుండా ప్రారంభమవుతున్నాయి. గ్రామాల్లో రైతులు ఆర్థిక ఇబ్బందులు లేకుండా వ్యవసాయ పనులలో నిమగ్నమవుతున్నారు. ఈ పథకం ద్వారా అందుతున్న సహాయంతో రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసి సకాలంలో సాగు పనులు చేపడుతున్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాలలో నిధులు జమ కావడం వల్ల రైతులకు పూర్తి ప్రయోజనం చేకూరుతోంది. జిల్లాలోని గిరిజన, చిన్న, సన్నకారు రైతులకు ఈ పథకం ఎంతో భరోసాను కల్పిస్తోంది.





పెట్టుబడి కోసం అధిక వడ్డీకి అప్పులు తీసుకోవాల్సిన అవసరం తగ్గి, రైతులు ప్రశాంతంగా వ్యవసాయం చేసుకునే పరిస్థితి ఏర్పడింది. రైతు భరోసా ద్వారా అందుతున్న నిధులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కూడా ఊతమిస్తూ స్థానిక వ్యాపారులకు ప్రయోజనం చేకూరుస్తున్నాయి. రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమనే విషయాన్ని రైతు భరోసా మరోసారి నిరూపించింది. రైతు శ్రమకు విలువనిస్తూ, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు గ్రామీణాభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 67.44 లక్షల మంది రైతులకు 7,135.77 కోట్ల రూపాయలు రైతు భరోసా విడుదల కాగా, అందులో కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కూడా విశేషంగా లబ్ధి పొందింది. ఈ సహాయం రైతుల ఆర్థిక స్థిరత్వాన్ని పెంచడమే కాకుండా, వానాకాలం సాగును విజయవంతంగా ప్రారంభించేందుకు కీలకంగా మారింది. రైతు భరోసా పథకంపై జిల్లా కలెక్టర్ కె.హరిత మాట్లాడుతూ రైతుల సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చేయూత అందిస్తుందని తెలిపారు. రైతు సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతకు రైతు భరోసా పథకం నిలువెత్తు నిదర్శనమని, రైతు బాగుంటే గ్రామం బాగుంటుంది - గ్రామం బాగుంటే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది అనే నినాదంతో ప్రభుత్వం ముందుకు సాగుతుండగా, కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో రైతుల ముఖాల్లో కనిపిస్తున్న చిరునవ్వులే ఈ పథకం విజయానికి అసలైన నిదర్శనమని తెలిపారు.

## ములుగు పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత రెసిడెన్షియల్ పోలీసు రిక్రూట్‌మెంట్ కోచింగ్

- **7000 పోలీసు ఉద్యోగాలకు గ్రీన్ సిగ్నల్**
- **యువతకు బంగారు అవకాశం - సమీప పోలీస్ స్టేషన్ లో పేర్లు నమోదు చేసుకోండి**
- **మహిళా అభ్యర్థులను స్వాగతిస్తున్నాం... తమ కలల్ని సాకారం చేసుకోండి**
- **పేద, గ్రామీణ, మారుమూల ప్రాంతాల యువత సద్వినియోగం చేసుకోవాలి**
- **జిల్లా ఎస్పీ కేకాన్ సుధీర్ రామనాథ్**



**ములుగు ప్రతినిధి, జులై 04(జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖ, ఎస్‌పీఎఫ్ (ఎస్ పి ఎఫ్), జైళ్ల శాఖ (ప్రిసన్స్) తదితర విభాగాల్లో సుమారు 7,000 ఖాళీల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో, ములుగు జిల్లా నిరుద్యోగ యువతకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ములుగు జిల్లా పోలీసు శాఖ ఉచిత శిక్షణ కార్యక్రమం చేపట్టింది. జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామనాథ్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరగనుంది. అనుభవజ్ఞులైన, అర్హత కలిగిన అధ్యాపకులు మరియు ఫిజికల్ ట్రైనర్లతో ఉచిత రెసిడెన్షియల్ కోచింగ్ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ కోచింగ్‌లో ఉచిత వసతి, తరగతి బోధన, శారీరక శిక్షణ అందించబడుతుంది. ములుగు జిల్లాలో ముఖ్యంగా పేద, గ్రామీణ, గిరిజన మరియు మారుమూల ప్రాంతాల యువతీ యువకులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ జీవిత లక్ష్యాన్ని సాధించాలని జిల్లా పోలీసు శాఖ కోరుతోంది. పోలీసు శాఖలో చేరాలనే ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ సమీప పోలీస్ స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలి. కోచింగ్ ప్రారంభ తేదీ, స్థలం మరియు ఇతర పూర్తి వివరాలను త్వరలో అధికారికంగా మీడియా ద్వారా ప్రకటించబడుతుంది. "ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని... కష్టపడి శ్రమించి తెలంగాణ పోలీసు శాఖలో ఉద్యోగం సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని." ఎస్పీ యువతకు తెలిజేశారు.



# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల ప్రతినిధి , జూలై 4 (జనంసాక్షి) :** ప్రజల సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, ఈ క్రమంలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో కొనసాగుతున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులను ఆకస్మికంగా సందర్శించి పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు 129.25 కోట్ల రూపాయలతో ప్రభుత్వ ఆసుపత్రి, 23.75 కోట్ల రూపాయలతో క్రిటికల్ కేర్ విభాగం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అంతకుముందు నస్పూర్ మండల కేంద్రంలో గల ఈ.వి.ఎం. గోదాము వద్ద భద్రత చర్యలను పరిశీలించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, వి.వి. పాట్ల భద్రతకు పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని, సి.సి. కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుంజేడు ముసలమ్మ ట్రస్ట్ బోర్డ్ ఆధ్వర్యంలో చెరువు కాలువల్లో పూడిక తొలగింపు

## ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్ పుల్సం సురేష్ చొరవ



**గంగారం జులై 4 (జనం సాక్షి)** గంగారం మండల పరిధిలోని కోడిసెలమిట్ట పందెం గ్రామపంచాయతీ చెరువు కాలువలో గత కొంతకాలంగా మట్టి, ఇసుక పేరుకుపోవడంతో ఆయకట్టు రైతులకు సాగునీరు అందడంలో ఇబ్బందులు ఏర్పడ్డాయి. నీరు సరిగా వెళ్లకపోవడంతో ఆయకట్టు దిగువ పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ట్రస్ట్ బోర్డ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన గుంజేడు ముసలమ్మ ట్రస్ట్ బోర్డ్ డైరెక్టర్ పుల్సం సురేష్ తన సొంత ఖర్చులతో జేసీబీ యంత్రాలను రప్పించి కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగించే పనులను చేపట్టారు. ఈ సందర్భంగా పుల్సం సురేష్ మాట్లాడుతూ, మంత్రి సీతక్క ఆదేశాల మేరకు “రైతు సమస్య అంటే అది ప్రజా పాలన ప్రభుత్వ సమస్య. ప్రభుత్వం నిధులు విడుదల చేసేలోపు పంట దెబ్బతింటుంది. అందుకే సీతక్క ఆదేశాల మేరకు ముందుగా మేమే ముందుకు వచ్చి కాలువలను శుభ్రం చేస్తున్నాం. రాబోయే రోజుల్లో మరిన్ని కాలువల్లో కూడా పూడిక తొలగిస్తాం” అని తెలిపారు.

### రైతుల హర్షం:

ట్రస్ట్ బోర్డ్ చొరవను స్థానిక రైతులు అభినందించారు. “ముసలమ్మ ట్రస్ట్, సురేష్ అన్న లేకపోతే మా పంటలు నష్టపోయేవి. ఇప్పుడు కాలువ క్లీన్ కావడంతో నీరు సాఫీగా పొలాలకు వెళ్తుంది” అని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎనిమిదో వార్డ్ మెంబర్ గుంట అరుణ సూర్యం, నర్సింగరావు, బుచ్చి రాములు, పవన్ సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సాయి సేవా ట్రస్ట్‌లో డొక్కా సీతమ్మ భోజనాలయం ప్రారంభం

**కాజీపేట, జూలై 4: (జనం సాక్షి)** హనుమకొండ జిల్లా వడ్డేపల్లి పోలీస్ కాలనీలోని సాయి సేవా ట్రస్ట్‌లో ఏర్పాటు చేసిన డొక్కా సీతమ్మ భోజనాలయాన్ని అమెరికాలోని స్పందన ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ నిడమనూరు నాగేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..., స్పందన ఫౌండేషన్ పేద, అనాథ మరియు అర్ధానాథ విద్యార్థుల విద్యాభివృద్ధికి, అలాగే వృద్ధుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు. అనాథ, అర్ధానాథ చిన్నారుల విద్య, సంక్షేమం, భవిష్యత్ అభివృద్ధి కోసం దాతలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు ముందుకు వచ్చి సహకరించాలని పిలుపునిచ్చారు. “అనాథ పిల్లలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వారి చదువు, భవిష్యత్ కోసం మేము అండగా ఉంటాం” అని ఆయన హామీ ఇచ్చారు. పేదలకు అన్నదానం చేయడం, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం నిజమైన మానవతా సేవ అని, డొక్కా సీతమ్మ ఆదర్శాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాయి సేవా ట్రస్ట్ చైర్మన్ చిన్నాల రంగయ్య, వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సాయి స్పందన హైస్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాసరావు, మాజీ బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ మండల పరశురాములు, ట్రస్ట్ సభ్యులు రవీందర్, లింగమూర్తి, భగవంతయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు సాయి సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. చివరగా సమాజంలోని పేదలు, అనాథలు, నిరుపేదల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ సేవాభావంతో ముందుకు రావాలని పిలుపునిస్తూ కార్యక్రమం ముగిసింది.

# రైతుల భూములను బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్న ప్రభుత్వాలు

## సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు



**వరంగల్ ఈస్ట్, జూలై 04 (జనం సాక్షి)** రైతును రాజును చేస్తామన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దేశానికి అన్నం పెట్టే రైతుల భూములను బడా కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నాయని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గ్రేటర్ కమిటీ వరంగల్ కార్యదర్శి రాచర్ల బాలరాజు అన్నారు. నగరంలోని ఖిలా వరంగల్ పడమర కోట తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు కామ్రేడ్ దొడ్డి కొమురయ్య 80 వ సంస్మరణ కార్యక్రమాన్ని జరిపారు. ముందుగా దొడ్డి కొమరయ్యకు ఘనంగా నివాళులు అర్పించారు. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో భూమికోసం భుక్తి కోసం పీడిత ప్రజల విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటం ఫలితంగా పేద ప్రజలు లక్షలాది ఎకరాలను స్వాధీనం చేసుకొని అనుభవించారని ఆయన అన్నారు. విప్లవకారుల నాయకత్వంలో ఎక్సలబరీ శ్రీకాకుళం గోదావరి లోయ దండకారణ్య ప్రాంతంలో ప్రజలు స్వాధీనం చేసుకొని అనుభవించారని జీర్ణించుకోలేని జాతీయ ప్రాంతీయ పార్టీల ప్రభుత్వాలు ఉద్యమాల అణచివేతకే పూనుకున్నాయన్నారురాష్ట్రంలో రైతుల భూములను గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఫార్మసిటి పేరిట కార్పొరేట్ సంస్థలకు అప్పజప్ప చూస్తే నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పేరుతో రైతుల భూమి లాక్కునే దుష్ట ప్రయత్నం చేస్తున్నదని బాలరాజు అన్నారు. అంబానీ అదానీల వ్యాపార లాభాల కోసం కేంద్ర ప్రభుత్వం నిర్మించే గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారుల వల్ల వందల ఎకరాలు రైతులు నష్టపోతున్నారని వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు ఇచ్చిన ఆర్డర్లను ప్రక్కన పెట్టి రైతులపై అక్రమ నిర్బంధం ప్రయోగిస్తున్నారన్నారు . పేదరైతంగానికి భూమి దక్కేంతవరకు పోరాటాలు ఉంటాయని నాటి రైతాంగ పోరాటాల స్ఫూర్తితో ఉద్యమాలు తప్పక వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు బైరబోయిన ఐలయ్య అరుణోదయ నాయకులు నళిగంటి విజయపాల్ ఐఎఫ్‌టియు నగర అధ్యక్ష కార్యదర్శులు ఎర్ర జయ బాబు బన్న నర్సింగం పివైఎల్ జిల్లా అధ్యక్షులు రంజిత్ పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ మరియు హరిబాబు బండి వెంకటేశ్వర్లు రాజు ఏలియా మన్నే కరుణాకర్ ఇనుముల కృష్ణ ఎండి అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

# రామప్ప దేవాలయ కట్టడం అద్భుతం

## ఇంగ్లాండ్ దేశస్తుల కితాబ్



**వెంకటాపూర్(రామప్ప),జూలై04(జనం సాక్షి):-** రామప్ప దేవాలయ కట్టడం అద్భుతమని ఇంగ్లాండ్ దేశానికి చెందిన దంపతులు కితాబ్ ఇచ్చారు. ఈ మేరకు వారు శనివారం వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో గల ప్రపంచ ప్రసిద్ధిగాంచిన రామప్ప దేవాలయాన్ని ఇంగ్లాండ్ దేశానికి చెందిన దంపతులు జోనాతన్ బ్రే - అమంద లు సందర్శించారు. ఈ సందర్భంగా వారు ముందుగా రామప్ప గుడిలోని రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, వారికి ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్‌లు వారికి స్వామి వారి ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలను ఈ సందర్భంగా అందజేశారు. అనంతరం వారు ఆలయ విశిష్టత, శిల్పకళ నైపుణ్యత గురించి టూరిజం గైడ్లు గోరంటాల విజయ్ కుమార్, తాడబోయిన వెంకటేష్ లను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం వారు రామప్ప చెరువు వద్దకు చేరుకొని చెరువులో బోట్ షికారు చేస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

# దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పించిన- కలెక్టర్, ఎం పి



మావల **జూలై 04 (జనం సాక్షి)** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఘనంగా నివాళులు అర్పించారు. శనివారం జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ లతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా రైతుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన దొడ్డి కొమురయ్య త్యాగం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని అన్నారు. ఆయన చూపిన పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలోనూ, తెలంగాణ ఆత్మగౌరవ పరిరక్షణలోనూ అమరవీరుల త్యాగాలను ఎప్పటికీ మరువలేమని, వారి ఆశయాల సాధనే వారికి మనం అందించే నిజమైన నివాళి అని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్న సూపర్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యేలు.

# జ్యువెలరీ దుకాణాల్లో భద్రతా ఏర్పాట్ల పరిశీలన



**రామకృష్ణాపూర్, జులై 04(జనంసాక్షి):** ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలోని పలు జ్యువెలరీ దుకాణాలను పట్టణ ఎస్.ఐ. జాడిశ్రీధర్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, రికార్డింగ్ సామర్థ్యం, కెమెరాల కవరేజీని పరిశీలించారు. ప్రతి జ్యువెలరీ షాపులో నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, అవి 24 గంటల పాటు నిరంతరం పనిచేసేలా నిర్వహించాలని యజమానులకు సూచించారు. డీవీఆర్ రికార్డింగ్‌ను భద్రంగా భద్రపరచాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు. వ్యాపారులు పోలీస్ శాఖతో సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్.ఐ. పేర్కొన్నారు.

# ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం

- కుబీర్ పంచాయతీ కార్యదర్శి మాధవ్
- వ్యాపారస్తులు లైసెన్స్ కలిగి ఉండాలి
- స్థానిక దుకాణాల్లో తనిఖీలు చేసిన పంచాయతీ అధికారులు




**కుబీర్, జూలై 4, (జనంసాక్షి):** కుబీర్ మండల కేంద్రంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మేజర్ గ్రామపంచాయతీ కార్యదర్శి మాధవ్ స్పష్టం చేశారు. శనివారం ఆయన పంచాయతీ సిబ్బందితో కలిసి మండల కేంద్రంలోని పలు వ్యాపార సముదాయాలు, హోటళ్లు, కిరాణా దుకాణాలను సందర్శించి పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ కవర్లు, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను వాడుతున్న వ్యాపారులతో ముచ్చటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి తీవ్ర నష్టం చేకూరుస్తున్న ప్లాస్టిక్ వాడకాన్ని కుబీర్ పరిధిలో పూర్తిగా నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. వ్యాపారస్తులు, ప్రజలు ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జనపనార, గుడ్డ సంచులను మాత్రమే వినియోగించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించి ప్లాస్టిక్ విక్రయించినా, వాడినా జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల కేంద్రంలో వ్యాపారం నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రేడ్ (షాప్) లైసెన్స్ కలిగి ఉండాలని కార్యదర్శి మాధవ్ ఆదేశించారు. ప్రస్తుతం లైసెన్స్ లేని వ్యాపారస్తులకు మూడు రోజుల పాటు తుది గడువు విధిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మూడు రోజుల్లోగా పంచాయతీ కార్యాలయంలో అవసరమైన రుసుము చెల్లించి, లైసెన్స్ పొందాలని సూచించారు. గడువు ముగిసిన తర్వాత లైసెన్స్ లేకుండా అక్రమంగా వ్యాపారాలు నిర్వహిస్తే, సదరు దుకాణాలను సీజ్ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గ్రామ స్వచ్ఛత, అభివృద్ధి కోసం వ్యాపారులు, ప్రజలు పంచాయతీ సిబ్బందికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ తనిఖీల్లో పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# యువత వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** నిరుద్యోగ యువత వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కోరారు. సింగరేణి సంస్థ సి.ఎస్.ఆర్ నిధులతో భూపాలపల్లి పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత కోసం నిర్వహించిన డ్రోన్ టెక్నీషియన్ కోర్సు ముగింపు, సర్టిఫికెట్ల ప్రధానోత్సవ కార్యక్రమం శనివారం సింగరేణి జిఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, వ్యవసాయ, సహకార, డిఆర్డీఏ, సింగరేణి తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ సాధారణంగా హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి ఈ డ్రోన్ టెక్నీషియన్ శిక్షణ పొందాలంటే 50 వేల వరకు ఖర్చవుతుందని, అలాంటి ఖరీదైన కోర్సును మన భూపాలపల్లి ప్రాంత నిరుద్యోగ యువతకు ఇక్కడే ఉచితంగా అందించడం గర్వకారణమన్నారు. సింగరేణి, టాస్క్ ద్వారా ప్రభుత్వం తరపున స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ప్రారంభించి, మొదటి విడతగా 24 మంది నిరుద్యోగ యువతకు డ్రోన్ టెక్నాలజీలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసి సర్టిఫికెట్లు అందించినట్లు తెలిపారు. యువత డ్రగ్స్, గంజాయి, గుట్కా వంటి చెడు మార్గాల వైపు వెళ్లకుండా, నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ద్వారా శిక్షణ పొంది సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో నిర్వహించిన జాబ్ మేళా ద్వారా సుమారు 10 వేల మంది నిరుద్యోగులు హాజరుకాగా, అందులో 2,700 మంది యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించామని అన్నారు. త్వరలోనే మరిన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యంతో మరోసారి మెగా జాబ్ మేళా నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రస్తుత ఆధునిక వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం ఎంతో పెరిగిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, నాబార్డ్ ద్వారా సబ్సిడీపై రైతులకు, ఐకేపీ, డ్వాక్రా మహిళా సంఘాలకు ఈ డ్రోన్‌లను అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు సబ్సిడీ డ్రోన్ల ఎంపికలో ప్రాధాన్యత ఇస్తూ, వారు రైతులకు మందుల పిచికారీ వంటి పనుల్లో సహాయపడుతూ ఉపాధి పొందేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. ఈ కేంద్రాల్లో లభించే 38 రకాల విభిన్న స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులకు కేవలం రెండు కోర్సులకు మాత్రమే ఆసక్తి చూపుతున్నారని, మిగిలిన కోర్సులపై విస్తృతంగా ప్రచారం చేసి నిరుద్యోగ యువతకు అవగాహన కల్పించాలని కోరారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. నిరుద్యోగ యువతకు అత్యాధునిక సాంకేతిక రంగాలలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని తెలిపారు. సింగరేణి సంస్థ సి.ఎస్.ఆర్ నిధులతో నిరుద్యోగ యువతీ, యువకులకు నిర్వహించిన 2 వారాల ప్రత్యేక డ్రోన్ టెక్నీషియన్ కోర్సు నిర్వహించడం పట్ల అభినందించారు. ప్రస్తుతం డ్రోన్ టెక్నాలజీ అనేది ఎంతో వేగంగా విస్తరిస్తున్న అధునాతన రంగమని పేర్కొన్నారు. గత ఏడాది నాబార్డ్ సంస్థ ద్వారా భూపాలపల్లి జిల్లాలో అర్హులైన యువతకు డ్రోన్ టెక్నాలజీలో శిక్షణ ఇవ్వడానికి ఒక సమగ్ర కార్యాచరణ నివేదిక సిద్ధం చేసినట్లు తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల కొంత ఆలస్యం జరిగిందని యువతకు ఈ అవకాశాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో సింగరేణి సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా ఈ ప్రత్యేక డ్రోన్ టెక్నీషియన్ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. జిల్లా యంత్రాంగం చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి, యువతకు రెండు వారాల పాటు నాణ్యమైన శిక్షణ, గుర్తింపు పొందిన సర్టిఫికెట్లు అందజేయడానికి సహకరించిన సింగరేణి యాజమాన్యానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ శిక్షణ ద్వారా లభించిన సర్టిఫికెట్లతో యువత సొంతంగా డ్రోన్ ఆధారిత సేవల రంగంలో ఉపాధిని ప్రారంభించవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో డ్రోన్ల వినియోగం పెరగనుండటంతో ఈ శిక్షణ పొందిన వారికి మంచి డిమాండ్ ఉంటుందన్నారు. అనంతరం యువతకు శిక్షణ సర్టిఫికెట్లు అందచేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి జిఎం రాజేశ్వర రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బుర్ర కొమురయ్య , వైస్ చైర్‌పర్సన్ అంబాల శ్రీనివాస్, జిల్లా, నాబార్డు అధికారులు, సింగరేణి అధికారులు, శిక్షణ పూర్తి చేసుకున్న నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు చిట్యాల సాగర్‌కి ఘనసన్మానం



**నూగూర్ వెంకటాపురం జూలై 4(జనం సాక్షి ):-**వెంకటాపురం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ ఆవరణలో శనివారం నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చిట్యాల సాగర్ కి వెంకటాపురం మండల ఎమ్మార్పిస్ అధ్యక్షులు యాసం రమేష్ మాదిగ ఘనంగా సన్మానించారు . ఈ కార్యక్రమంలో యాసం రమేష్ మాదిగ మాట్లాడుతూ. వెంకటాపురం మండలంలోని కాంగ్రెస్ పార్టీ. మాదిగలను గుర్తించి పదవులు ఇచ్చిన వెంకటాపురం కాంగ్రెస్ పార్టీ నాయకులకి, మంత్రివర్యులు దనసరి అనసూయ (సీతక్క )కి అలాగే ములుగు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ అన్నకి భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు కి యాసం రమేష్ మాదిగ కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో. సామాజిక కార్యకర్త డాక్టర్ రాంబాబు మాజీ ఎంపీటీసీ చిట్యాల అరుణ్ కుమార్ మాదిగ. ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు యాసం మహేష్ మాదిగ చెన్నం నరసింహారావు మాదిగ చిట్యాల రవీందర్ మాదిగ. సమ్మాలు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# హరిత నిర్మల్‌కు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి



నిర్మల్ బ్యూరో, జూలై 4 (జనంసాక్షి): **పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి** వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం ద్వారా హరిత సమాజ నిర్మాణానికి తోడ్పడాలని మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి అన్నారు. నిర్మల్ పట్టణంలోని ప్రియదర్శిని నగర్‌లో గల గౌతమ్ మోడల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన మొక్కల నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించి భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే మొక్కల పెంపకమే ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రకృతిని ప్రేమిస్తూ పర్యావరణ పరిరక్షణలో చురుకుగా పాల్గొని ప్రతి మొక్కను బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జగతి రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ కౌన్సిలర్లు కత్తి నరేందర్, లక్కాకుల హరీష్, నాయకులు అజార్, అడప శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో చురుగ్గా పాల్గొన్న ఎన్‌టీఆర్ కాలనీ ప్రజలు



**రెబ్బెన, జూలై04 (జనంసాక్షి):** రెబ్బెన మండల కేంద్రంలోని ఎన్‌టీఆర్ కాలనీలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం విజయవంతంగా సాగింది. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు ఉత్సాహంగా పాల్గొని దరఖాస్తు పత్రాలను పూర్తి చేసి అధికారులకు అందజేశారు. ఎంఆర్ఐ సౌమ్య, జీపీఓ ప్రియమాల, బీఎల్ఓ బాలమ్మ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి దరఖాస్తు పత్రాలను పంపిణీ చేసి వాటిని పూర్తిచేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోడెం సుదర్శన్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకులు మోడెం చిరంజీవి గౌడ్, బీఎల్ఏలు మోడెం రాజా గౌడ్, దుర్గం రాజేష్, అన్నపురెడ్డి శాంతికుమార్ గౌడ్, వార్డు సభ్యుడు గోడినెల భరత్ గౌడ్, ఇతర నాయకులు అన్నపురెడ్డి మురళి గౌడ్, గొగ్గర రాజేష్, బోడు రమేష్ పాల్గొన్నారు. అలాగే శ్రీకాంత్ గౌడ్, నాయకిరెడ్డి, అక్షయ్, రామ్ కుమార్, మోడెం మహేష్ గౌడ్ తదితరులు ప్రజలకు ఓటరు జాబితా సవరణపై అవగాహన కల్పించి, దరఖాస్తుల నమోదులో సహకరించారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో విస్తృత సేవా కార్యక్రమాలు..

### ముఖ్యఅతిథిగా జోన్ చైర్ పర్సన్ శైలజ



**కేసముద్రం,జులై 4 (జనం సాక్షి)** మండలంలోని బ్రహ్మంగారి గుడి తండాలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథిగా జోన్ చైర్ పర్సన్ లయన్ వజినపల్లి శైలజ పాల్గొనగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.లయన్ రాపాక కుమార్ తనయుడు విజయ్ జన్మదినాన్ని పురస్కరించుకొని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆట వస్తువులు,స్టడీ మెటీరియల్ అందజేయగా,క్లబ్ ట్రెజరర్ మదిపెద్ది వెంకటేష్ తనయుని జన్మదినాన్ని పురస్కరించుకొని హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ మేరకు తండావాసులకు,ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై, పర్యావరణం పరిరక్షణ పై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో చార్టర్ ప్రెసిడెంట్ డాక్టర్ చంద్రశేఖర్, క్లబ్ అధ్యక్షుడు యర్నం శ్రీరాములు, ప్రేమ్‌కుమార్,కరుణాకర్,శివభారత్,శ్రీనివాస్, రాజు, అంగన్‌వాడీ సిబ్బంది జ్యోతి, ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి 52 వేల ఆర్థిక సహాయం



**స్టేషన్ ఘన్‌పూర్, జూలై 04 ( జనం సాక్షి ) :** మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన బూరుగు సాంబరాజు ఇటీవల మృతి చెందడం జరిగింది. మృతుడి కుటుంబానికి అండగ నిలిచిన పదవ తరగతి స్నేహితులు,ఇలాంటి క్లిష్ట సమయంలో స్నేహితులంతా కలిసికట్టుగా ముందడుగు వేయడం చాలా గొప్ప విషయం. తమ మిత్రుడు భౌతికంగా దూరమైనా, పదవ తరగతి స్నేహితులు అందరూ మానవత్వంతో కుటుంబానికి యాభై రెండు వేల (52,000) రూపాయలుఆర్థిక సహాయం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ సందర్భం గా మృతుడి స్నేహితులు మాట్లాడుతూ మేం అందరం ఆ కుటుంబానికి భవిష్యత్ లో కూడ అండగా ఉంటామని సాంబరాజు పిల్లలకు మనో ధైర్యాన్ని ఇవ్వడం జరిగింది.ఈమంచి కార్యక్రమం చేసిన పదవ తరగతి 2005-2006 బ్యాచ్ స్నేహి తులకు కుటుంబ సభ్యులు ధ్యానవాదములు తెలిపారు.

## ఎస్ ఐ ఆర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ

### కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగే బ్రహ్మానంద్



**గుడిహత్నూర్ ,జూలై 4, (జనం సాక్షి)** గుడిహత్నూర్ మండలంలోని బూత్ 106 లో భారత ఎన్నికల సంఘం చేపట్టిన రా×= ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షులు శ్రీ పతంగే బ్రహ్మానంద్ శనివారం పాల్గొన్నారు.ఈ సందర్భంగ మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ఓటరు జాబితా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతి అర్హుడైన పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు, ఇప్పటికే ఓటరు జాబితాలో ఉన్న వారు తమ వివరాలను పరిశీలించి అవసరమైతే సవరణలు చేయించుకోవాలని సూచించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు బూత్ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చాటేసంబాజీ, సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ జాదవ్ రమేష్, సిద్ధార్థ ససానే,కుమార్ కేంద్రే, సురేష్, పార్టీ నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## భూ రీసర్వేతో ప్రతీ రైతుకు న్యాయం జరుగుతుంది

### సర్పంచ్ జున్నుకనుకయ్య యాదవ్

**పర్వతగిరి జూలై 4 జనం సాక్షి** శనివారం రోజున జరిగిన పైలెట్ ప్రాజెక్ట్ లో భాగంగా జమాల్ పురంలో చేపట్టిన భూమి రెసర్వే గురించి గ్రామసభలో సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ ప్రసంగిస్తూ.తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ సమగ్ర భూ సర్వే చాలా ముఖ్యమైన కార్యక్రమం. సంవత్సరాల తరబడి ఉన్న భూమి వివాదాలు, రికార్డుల్లో తప్పులు, కొనుగోలు, వారసత్వ సమస్యలు, కొలతల్లో గందరగోళం – ఇవన్నీ ఒకేసారి సరిచేసేందుకు ప్రభుత్వం ఈ అవకాశం ఇచ్చింది. మీ భూమికి చట్టబద్ధంగా రక్షణ కల్పించడానికి చేస్తున్న భూ సర్వే.వ్యవసాయ భూమిలో సాగులో లేకుండా, వేరొకరికి అమ్ముకొని ఉండి, కొనుగోలు చేసిన వారు సాగులో ఉన్న యెడల, అన్ని రికార్డులు అమ్మిన వ్యక్తి పేరున ఉన్నా, అది కొనుగోలు చేసిన వ్యక్తికే చెందుతుంది. అంటే ఇక్కడ రికార్డుల కన్నా, ఆ భూమిలో ప్రస్తుతం ఎవరు ఖబ్జాలో ఎవరు ఉన్నారు, సాగులో ఎవరు ఉన్నారు అనే దానినే అధికారులు, పరిగణలోకి తీసుకుంటారని ఆయన చెప్పారు. చివరిగా ఈ భూ సర్వే తరువాత



మన గ్రామంలో ఒక్క భూ తగాదా కూడా ఉండకూడదు. ప్రతి రైతు దగ్గర సరైన రికార్డులు ఉండాలి. అప్పుడే మన గ్రామం నిజంగా అభివృద్ధి చెందుతుంది. అందరూ సహకరించాలని కోరారు కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య వర్ధంతిని వేడుకలు...

**పెద్దవంగర, జూలై04:(జనం సాక్షి )** తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని అంబేద్కర్ రస్తాలో యాదవ సంఘ నాయకుల ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం దొడ్డి కొమరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం యాదవ సంఘ జిల్లా నాయకులు నిమ్మల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..సాయుధ పోరాటంలో తొలి అమరుడు నైజాం తూటాలకు నేలరాలిన పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అన్నారు. తెలంగాణలో నిజాం విరంకుశ పాలన నుండి విముక్తి పొందడానికి అలుపెరుగని పోరాటం చేసిన మహావీరుడు అని కొనియాడారు. 50 ఏళ్లు నిండిన యాదవులకు ఆసరా పెన్షన్ అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన యాదవులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగి ఉన్న యాదవులకు గొర్రెల పెంపకానికి రాయితీతో కూడిన రుణాలు అందించాలని డిమాండ్ చేశారు.



గొర్రెలు మేకలు వేయడానికి ప్రతి గ్రామంలో 100 ఎకరాలు ప్రభుత్వం కొనుగోలు చేసి గ్రామ సొసైటీలకు అందించాలన్నారు. ప్రధాన కూడళ్లలో దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం మండల నాయకులు హరీష్‌యాదవ్, రాంమూర్తియాదవ్, సతీష్‌యాదవ్, కుమార్‌యాదవ్, కార్తీక్‌యాదవ్, పాల్గొన్నారు.

## కేటీఆర్‌ని కలిసిన ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు

**ఏటూరునాగారం, జులై 04(జనంసాక్షి).** హైదరాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, మర్యాదపూర్వకంగా కలిసి, ములుగు జిల్లా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, సంస్థాగత కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ములుగు జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎస్ఐఆర్ (సర్) కార్యక్రమంలో చురుకుగా పాల్గొని, బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ ప్రతి ఇంటిని సందర్శించి ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ప్రతి ఓటును పరిరక్షించే బాధ్యతతో అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే, త్వరలో ప్రారంభం కానున్న బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించి, ప్రతి కార్యకర్త, ప్రతి అభిమానికి సభ్యత్వం అందేలా కృషి చేయాలని లక్ష్మణ్ బాబు కి సూచించారు. ములుగు జిల్లాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కష్టపడి పనిచేస్తున్నారని అభినందించిన కేటీఆర్, ఇదే ఉత్సాహంతో ముందుకు సాగితే రాబోయే రోజుల్లో



బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. ములుగు గడ్డపై గులాబీ జెండా ఎగురవేసే లక్ష్యంతో నాయకులు, కార్యకర్తలు అందరూ ఐక్యంగా పనిచేసి పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో తాటి కృష్ణ, ఎండి వలీ బాబా, ఏటూరు నాగారం పీఏసీఎస్ చైర్మన్ కూనూరు అశోక్ గౌడ్, యలవర్తి శ్రీనివాసరావు, కుర్బాన్ అలీ, గద్దల రఘు, తదితరులు పాల్గొన్నారు.

## ములుగు సర్కిల్‌లో బదిలీపై వెళ్లిన అధికారులకు ఘన సన్మానం



**ములుగు ప్రతినిధి, జూలై 04(జనంసాక్షి).** ములుగు సర్కిల్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ములుగులోని ఆర్‌డబి గెస్ట్ హౌస్లో బదిలీపై వెళ్లిన అధికారులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అదే సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అధికారులకు ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన సూపరింటెండింగ్ ఇంజనీర్ ఏ ఆనందం, బదిలీపై వెళ్లిన డివిజనల్ ఇంజనీర్, ములుగు పి నాగేశ్వరరావు లను ఘనంగా సన్మానించి, ములుగు సర్కిల్ అభివృద్ధికి వారు అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. అలాగే నూతన సూపరింటెండింగ్ ఇంజనీర్ బి బిక్షపతి, డివిజనల్ ఇంజనీర్/టెక్నికల్ మరియు ఇన్చార్జి డివిజినల్ ఇంజనీర్ ములుగు కన్న రాజు, డివిజనల్ ఇంజనీర్, ఏటూరునాగారం జె పురుషోత్తం, అకౌంట్స్ ఆఫీసర్, ములుగు రాజ్ కుమార్ లకు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించి నూతన బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు అధికారులు, ఉద్యోగులు, కార్మికులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, అకౌంట్ సిబ్బంది, కార్మిక సోదరులు, కట్టర్ , బ్రేక్ డౌన్ టీం సభ్యులు, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, కాంట్రాక్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని, బదిలీపై వెళ్లిన అధికారులకు శుభాకాంక్షలు తెలియజేసి, నూతన అధికారులకు ఆత్మీయ స్వాగతం పలికారు.

# చినుకు పడితే చాలు... దారి అస్తవ్యస్తం

**• గుంతల్లో చిక్కుకున్న మాయపూర్ గ్రామం • ప్రయాణం నరకంగా మారిందని వాపోతున్న గ్రామస్తులు**



**దిలావర్‌పూర్, జూలై 04, (జనం సాక్షి):** చిన్నపాటి వర్షం కురిసినా బయటకు వెళ్లడం కష్టంగా మారింది. గుంతలు, బురదతో నిండిన రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. ఇది నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని మాయపూర్ గ్రామస్తుల దుస్థితి. మాయపూర్ గ్రామం నుండి జాతీయ రహదారిని కలుపుతున్న సుమారు 4 కి.మీ. రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఒకప్పుడు బీటీ రోడ్డుగా ఉన్న ఈ రహదారి పై ఇప్పుడు కాంక్రీట్ పూర్తిగా ఊడిపోయి గుంతలు గుంతలుగా మారింది. వర్షం పడిన వెంటనే ఆ గుంతలన్నీ నీటితో నిండిపోయి రోడ్డు ఎక్కడ ఉందో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

### నాలుగు కి.మీ. కు అరగంట ప్రయాణానికి

నిర్మల్–భైంసా జాతీయ రహదారికి కేవలం 4 కి.మీ. దూరంలో ఉన్నప్పటికీ, ఈ శిథిల రోడ్డు కారణంగా ద్విచక్ర వాహనంపై ప్రయాణించడానికి సగం గంట సమయం పడుతోంది. అత్యవసర సమయాల్లో అంబులెన్స్, స్కూల్ వాహనాలు కూడా గ్రామానికి రావడానికి ఇబ్బంది పడుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అభివృద్ధికి ఆమడ దూరం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఈ గ్రామం సిర్గాపూర్‌కు అనుబంధ గ్రామంగా ఉండేది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత చిన్న గ్రామాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో గ్రామ అభివృద్ధి జరుగుతుందని గ్రామస్తులు ఆశపడ్డారు. కానీ గ్రామ పంచాయతీ ఏర్పడి ఏళ్లు గడిచినా మాయపూర్ అభివృద్ధికి నోచుకోలేదు. చిట్యాల రోడ్డు నుండి ముజ్గీ వరకు రహదారిని రెండు వాహనాలు వెళ్లేలా వెడల్పు చేసినప్పటికీ, మాయపూర్‌ను కలుపుతున్న ఈ 4 కి.మీ. రోడ్డును మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### తక్షణమే మరమ్మతులు చేయాలని డిమాండ్

రోడ్డు దుస్థితి కారణంగా రోజూ విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డును వెంటనే మరమ్మతులు చేసి గ్రామస్తులకు తాత్కాలిక ఉపశమనం కల్పించాలని మాయపూర్ గ్రామస్తులు కోరుతున్నారు.

## నిరాశ్రయులైన మహిళకు నిత్యావసర సరుకులు అందజేత



**రామకృష్ణాపూర్, జులై04(జనంసాక్షి):** పట్టణంలోని 17వ వార్డుకు చెందిన వృద్ధురాలు పాశం భూదమ్మ ఇల్లు ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఉన్న కాస్త పాత ఇల్లు కూలి నిలువ నీడ లేకుండా అయ్యింది. నిరాశ్రయులైన మహిళను ఆదుకోవడానికి మందమర్రి పట్టణానికి చెందిన టిడిపి నాయకులు ముందుకు వచ్చారు. వృద్ధురాలికి నిత్యవసర సరుకులు అందజేసి ఇల్లు నిర్మాణానికి ఆర్థిక సహాయం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మందమర్రి పట్టణ అధ్యక్షుడు వాసాల సంపత్ మాట్లాడుతూ నాయకులు సంజయ్ కుమార్ ఆదేశాల మేరకు వృద్ధురాలు అయిన బూదమ్మ ఇంటి నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గ ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వృద్ధురాలికి సహాయం అందించాలని, అంతేకాకుండా మున్సిపల్ చైర్మన్ సంధ్యారాణి ఇంటి నిర్మాణానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కారం రాజు, మహిళా అధ్యక్షురాలు జూపాక సంధ్య, ఆవునూరి లక్ష్మి, తిరుమల, చోటు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ సర్వేలో బిఎల్ఓలతో పాటు బిఎల్ఏలు పాల్గొనాలి

**చిల్పూర్ గుట్ట దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు**





**స్టేషన్ ఘన్‌పూర్, జూలై 04 ( జనం సాక్షి ) :** ఎస్ఐఆర్ సర్వేలో బిఎల్వోలతో పాటు బిఎల్ఏలు కూడా పాల్గొనాలని క్లస్టర్ ఇంచార్జ్, చిల్పూర్ గుట్ట దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు అన్నా రు.మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ఘన్పూర్ స్థాని క ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు చిల్పూర్ మండ లంలోని క్లస్టర్ 1 పల్లగుట్ట, కృష్ణా జిగూడెం, ఫతేపూర్ గ్రామాలలో సర్పంచ్‌ల ఆధ్వ ర్యంలో బిఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో గ్రామాలలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. బి ఎల్ వో లతో కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏలు పాల్గొనాలని చిల్పూర్ గుట్ట దేవస్థానం చైర్మన్, క్లస్టర్ఇంచార్జ్ పొట్లపల్లి శ్రీధర్ రావు ఆదేశించారు. ఈ సమావేశంలో సర్పంచులు గుగులోత్ లక్ష్మీ ఉమ్లా నాయక్, ఎనగందుల నరసింహారెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, డైరెక్టర్ ఉమ్లా నాయక్,నాయకులు బాబురావు, మోహన్ నాయక్, రంగమ్మ,వేముల వెంకటేశ్వర్లు, మారపాక ఇసాక్, జక్కుల రాజయ్య, సాదం భీమయ్య, నీల రవి,బాలరాజు,పేరాల సుధాకర్,ఎనగందుల రత్నాకర్ రెడ్డి,వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్యకు ఘన నివాళి

**• దొడ్డి కొమరయ్య త్యాగం యువతకు స్ఫూర్తి • పొర్నంది రామయ్య.**



**మహబూబాబాద్ ప్రతినిధి, జూలై 4 (జనం సాక్షి):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా మహబూబాబాద్‌లోని నలంద డిగ్రీ కళాశాల ఆవరణలో సామాజిక అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షులు పొర్నంది రామయ్య మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య ప్రస్తుత జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని కడివెండి గ్రామానికి చెందినవారని తెలిపారు. నిజాం పాలనలో భూస్వాముల దోపిడీ, వెట్టిచాకిరి, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు 1946--48 మధ్య సాగించిన పోరాటమే తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమని వివరించారు. కడివెండి గ్రామంలో దొరసాని జానకమ్మ ఆధ్వర్యంలో ప్రజలపై వెట్టిచాకిరి, దోపిడీ, అన్యాయాలు తీవ్రస్థాయిలో జరిగేవని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆంధ్ర మహాసభ నాయకులు ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో గ్రామంలో సంఘం బలపడిందని, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా ప్రజలు ఐక్యంగా పోరాటం ప్రారంభించారని చెప్పారు. 1946 జూలై 4న విసునూరు రామచంద్రారెడ్డి గుండాలు గ్రామంపై దాడి చేయగా, ప్రజలు కర్రలు, బడిశెలతో ప్రతిఘటించారని తెలిపారు. ఆ సందర్భంగా గుండాల తుపాకీ కాల్పుల్లో దొడ్డి కొమురయ్య అమరుడయ్యారని, ఆయన త్యాగం తెలంగాణ విముక్తి ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిందన్నారు. కొమురయ్య అమరత్వంతో జనగామ ప్రాంతమంతా ఉద్యమ జ్వాలలు రగిలాయని, ప్రజలు భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా మరింత ఉద్ధృతంగా పోరాడారని గుర్తు చేశారు. యువత దొడ్డి కొమురయ్య వంటి అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని సామాజిక న్యాయం, సమానత్వం కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నలంద డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేబీ శంకర్, నలంద జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గట్ల శ్రీపాల్ రెడ్డి, బుర్ర గోవర్ధన్, లెక్చరర్ నరేష్, కావ్య, మైమున తదితరులు పాల్గొని దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

# బంజారా ఐక్యతకు ప్రతీక సీత్ల పండుగ: డాక్టర్ నెహ్రూ రాథోడ్



**మహబూబాబాద్ ప్రతినిధి, జూలై 4 (జనం సాక్షి):** బంజారా సమాజ ఐక్యతకు ప్రతీకగా నిలిచే సాంప్రదాయ సీత్ల పండుగను జూలై 7న (పెద్ద పూసల కార్తె తొలి మంగళవారం) రాష్ట్రవ్యాప్తంగా అందరూ ఒకే రోజున ఘనంగా నిర్వహించాలని సేవాలాల్ సేన నాయకులు పిలుపునిచ్చారు. మానుకోటలోని కార్తీక్ హాస్పిటల్‌లో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు గుగులోతు నందులాల్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రముఖ సీనియర్ వైద్యులు డాక్టర్ నెహ్రూ రాథోడ్, సేవాలాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సేవాలాల్ వెంకన్న నాయక్ పాల్గొని మాట్లాడారు. వారు మాట్లాడుతూ, ప్రాచీన కాలం నుంచి పశుసంపద అభివృద్ధి చెందాలని, పంటలు సమృద్ధిగా పండాలని, వర్షాలు బాగా కురవాలని ఆకాంక్షిస్తూ బంజారా సమాజం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించే తొలి సాంప్రదాయ పండుగ సీత్ల పండుగ అని తెలిపారు. జాతి ఐక్యతను చాటేలా ప్రతి తండాలో ఒకే రోజున సంప్రదాయబద్ధంగా ఈ పండుగను ఘనంగా నిర్వహించాలని కోరారు. అలాగే సీత్ల పండుగకు ప్రభుత్వం అధికారిక గుర్తింపు ఇచ్చి ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. తండా సర్పంచులు, నాయకులు పండుగ విశిష్టతను యువతకు తెలియజేస్తూ సాంప్రదాయాలను పరిరక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో సేవాలాల్ సేన జాతీయ నాయకులు ధారవత్ మోతీలాల్ నాయక్, రాష్ట్ర అధికార ప్రతినిధి మాలోత్ సురేష్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాదావత్ రాంబాబు నాయక్, మానుకోట మండల అధ్యక్షులు బోడ రమేష్ నాయక్, బానోత్ వెన్నెల బాయి తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలానికి ముందస్తు చర్యలు..

**మంజులాపూర్‌లో డ్రైనేజీల పూడికతీత**



**నిర్మల్ టౌన్, జూలై 4:** వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శనివారం పట్టణంలోని మంజులాపూర్ (విజయనగర్ కాలనీ) ప్రాంతంలో డ్రైనేజీలు, మురికి కాలువలు (నాలాలు) పూడికతీత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ఆదేశాల మేరకు చేపట్టిన ఈ పనులతో వర్షపు నీరు సాఫీగా ప్రవహించి నీటి నిల్వలు ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి మాట్లాడుతూ, ప్రజల సౌకర్యమే లక్ష్యంగా పట్టణ పారిశుద్ధ్యం, అభివృద్ధికి మున్సిపల్ శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు. వర్షాకాలంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ హరిభువన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన భవన నిర్మాణాల కోసం నివేదిస్తాం

### ఆర్డీఓ దేవదాస్



**ఖానాపూర్ జూలై 04 (జనం సాక్షి)** శిథిలావస్థలో ఉన్న పాఠశాలల స్థానంలో నూతన తరగతి గదులు, భవన నిర్మాణాల కోసం కలెక్టర్ కు నివేదిస్తామని ఆర్డిఓ దేవదాస్ అన్నారు. శనివారం పట్టణంలోని తిమ్మాపూర్, బస్టాండ్ ప్రాథమిక పాఠశాలలను మున్సిపల్ చైర్ పర్సన్ అంక మౌనిక మహేందర్ తో కలిసి ఆయన సందర్శించారు. ఈ పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయని సందర్శించి పరిసరాలను పరిశీలించినట్లు తెలిపారు. అలాగే వాటి పైకప్పును వెంటనే తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆర్డిఓ వెంట తాహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రాధ, తదితరులు ఉన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహనా





**పెంచికల్ పేట్ జూలై 4 జనంసాక్షి** జిల్లా ఎస్పీ నితిక పంత్ ఆదేశాల మేరకు పెంచికల్ పేట్ మండలంలోని కేజీబీవీ పాఠశాల ప్రాంగణంలో జిల్లా పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాబృంద సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాల రూపంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, బాల్యవివాహాల ముప్పులు, రోడ్డు ప్రమాదాలు నివారణ, చట్టం-శాంతి భద్రత, మహిళల భద్రత, గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్, హెల్ప్‌లైన్ నంబర్లు (1930, 100, 1098) వినియోగం వంటి ముఖ్యాంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్రమశిక్షణ, నైతిక విలువలు, సమాజ సేవా భావన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏస్. ఓ, కవిత, పాఠశాల బృందం, కళబృందం సభ్యులు రోహిత్, రాంచందర్, శ్రీనివాస్, చంద్రశేఖర్, స్థానిక పోలీస్ కానిస్టేబుల్ రాజేష్ , విద్యార్థులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్



**కాటారం జూలై 4 (జనం సాక్షి) :** కాటారం మండల పరిధిలోని గంగారం గ్రామంలో బండం శ్రీనివాసరెడ్డి కుమారుడు సుకుమార్ రెడ్డి అఖిల గార్ల రిసెప్షన్ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు . కాటారం మండలం ఉడిపిలవంచ గ్రామంలో కూరల రాజయ్య కుమార్తె హిమశ్రీ సాయి గార్ల వివాహ వేడుకల్లో పాల్గొని ఆశీర్వదించారు. గ్రామంలో వేడుకల్లో పాల్గొని అందరితో కలివిడిగా మాట్లాడుతూ పలకరిస్తూ వర్షపాతం పరిస్థితి గురించి రైతులను అడుగుతూ మాట్లాడారు.

## నైన్‌పాక గ్రామంలో పోలీసుల 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్

- 20 వాహనాలకి ఫైన్, 5 లీటర్ల గుడుంబా స్వాధీనం
- బాధితుల వద్దకే వచ్చి 'ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్'నమోదు



**చిట్యాల, జులై 04( జనం సాక్షి) :**గ్రామాలలో గంజాయి మహమ్మారి నిర్మూలనకు ప్రజలందరూ సహకారం అందివ్వాలని, మీ పిల్లలు బంగారు భవిష్యత్తుకు దూరమవుతారని సిఐ మల్లేష్ అన్నారు.జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు, శనివారం చిట్యాల సీఐ డి. మల్లేష్ ఆధ్వర్యంలో, నైన్‌పాక గ్రామంలో పోలీసులు ముమ్మరంగా కార్డన్ అండ్ సెర్చ్ఆపరేషన్ నిర్వహించారు. పోలీసు సిబ్బందితో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటిని, అనుమానాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీల్లో భాగంగా గ్రామానికి చెందిన గుర్రం రాజేశ్వరి అనే మహిళ వద్ద, 5 లీటర్ల నాటు గుడుంబా లభ్యమైంది.ఆమెపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పోచంపల్లి సతీష్ వివరాలు వెల్లడించారు.సరైన పత్రాలు లేని 20 ద్విచక్ర వాహనాలను పోలీసులు గుర్తించి, వాటికి ఫైన్ విధించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు, అత్యవసర పరిస్థితులు ఎదురైనా వెంటనే '100' నంబర్‌కు కాల్ చేయాలని కోరారు. బాధితులు పోలీస్ స్టేషన్‌కు రాకపోయినా సమాచారం అందిన వెంటనే పోలీసులే స్వయంగా బాధితుడి వద్దకు వచ్చి, దరఖాస్తు తీసుకొని అక్కడికక్కడే ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారని స్పష్టం చేశారు.గ్రామాల్లో గంజాయి మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్రజలంతా ముందుకు రావాలని సీఐ పిలుపునిచ్చారు. గంజాయి విక్రయాలు, వినియోగానికి సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు అందించాలని, వారి వివరాలు గోప్యంగాఉంచుతామని హామీ ఇచ్చారు. అనంతరం సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో నైన్‌పాక గ్రామ సర్పంచ్ నక్క భాస్కర్, చిట్యాల ఎస్సై-2 రాజన్ కుమార్, ఎస్సై-3 ఈశ్వరయ్య లతో పాటు 24 మంది పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఎంతో ఆదర్శం

### జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఇందిర



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సాయుధ పోరాటంలో నేలరాలిన తొలి అమరుడిగా దొడ్డి కొమురయ్య చరిత్రలో నిలిచిపోయారని, ఆయన చూపిన పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఎంతో ఆదర్శమని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఇందిర తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు, బహుజన హక్కుల పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతి వేడుకలను శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి ఇందిర దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన బంధనాల నుండి ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చేందుకు, ఆత్మగౌరవ పతాకాన్ని ఎగురవేసేందుకు తన ప్రాణాలను ఫణంగా పెట్టిన గొప్ప వీరుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. బహుజన హక్కుల కోసం, బీసీల సామాజిక, రాజకీయ అభివృద్ధి కోసం దొడ్డి కొమురయ్య చేసిన పోరాటం దిక్సూచిగా నిలిచిందని పేర్కొన్నారు. కొమురయ్య జీవితం, ఆయన ఆవిర్భావం నుండి ఆత్మత్యాగం వరకు జరిగిన ప్రతి ఘట్టం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆయన చేసిన అసమాన సేవలకు, త్యాగానికి గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం దొడ్డి కొమురయ్య వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తోందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల ప్రతినిధులు కోరే సుధాకర్, కోరే కుమార్, నీలం రమేష్, స్వామి, సతీష్, యాదవ సంగం, కురుమ సంగం నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సర్వే పూర్తయిన బల్క్ భూముల నివేదికలు అందజేయాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సర్వే పూర్తయిన బల్క్ భూముల నివేదికలు అందజేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో బల్క్ భూములు, సర్వే, సాదా బైనామా, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై భూపాలపల్లి నియోజకవర్గ రెవెన్యూ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే పూర్తయిన బల్క్ భూములపై నివేదికలు అందజేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తయిన భూములకు సంబంధించిన పూర్తి నివేదికలను సిద్ధం చేసి తనకు సమర్పించాలని సూచించారు. ఈ నివేదికలను తదుపరి చర్యల కోసం ప్రభుత్వానికి పంపించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భూ సమస్యల పరిష్కారంలో అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు ఇంటింటికీ 98 శాతం ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయడం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు. అలాగే దీనికి సంబంధించిన ఆన్‌లైన్ ప్రక్రియ కూడా 9 శాతం పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా అంతే వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ వసంత కుమారి, ఆర్డిఓ హరికృష్ణ, భూపాలపల్లి డివిజన్ మండలాల తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# జీవిత చరిత్రను పాఠ్యపుస్తకంలో చేర్చాలి

**బచ్చన్నపేట జూలై 4 ( జనం సాక్షి):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్పించాలని సిపిఎం బచ్చన్నపేట మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో కొమురయ్య 80 వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా బెల్లంకొండ వెంకటేష్ మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వె ట్టి చాకిరి విముక్తి కోసం ఆనాటి నిజాం పాలన వ్యతిరేకంగా విష్ణురు దేశ్ముఖ్ రామచంద్రారెడ్డి ఆగడాల వ్యతిరేకంగా కడవెండి గ్రామంలో కష్టజీవులంతా ఏకమై పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహిస్తున్న సందర్భంగా దొడ్డి కొమురయ్య ఆ ఊరేగింపులో ఉత్సాహంగా ముందుండి పాల్గొనగా విష్ణుర్ దేశముకు రామచంద్రారెడ్డి గుండాల తుపాకి తూటాలకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య అని అన్నారు దొడ్డి కొమురయ్య మరణంతో తెలంగాణ ప్రాంతం మొత్తం రగిలిపోయి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం మరింత ఉవ్వెత్తిన ఎగసి పడిందని ఈ




సాయుధపోరాటంలో 4,000 మంది అమరులయి 10 లక్షల ఎకరాల భూములు పంచిన చరిత్ర అటువంటి మహత్తర చరిత్ర గల దొడ్డికొమురయ్యఆశయాలను మరింత ముందుకు తీసుకు పోతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యుడు పర్వతం నర్సింలు. నాయకులు రామగళ్ళ అశోక్. గంధ మల్ల మనోహర్. దండగల మురళీకృష్ణ. శిరీష. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం: సర్పంచ్ బోడ్డు దత్తాత్రి



**సిరికొండ (జనం సాక్షి) జులై 04 :** రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వమని సర్పంచ్ బోడ్డు దత్తాత్రి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా డబ్బులు ఎకరానికి రూ. 6వేలు చొప్పున వెయ్యడంపై అర్చం వ్యక్తం చేస్తూ సిరికొండ మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బోడ్డు దత్తాత్రి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని ఆయన అన్నారు. రైతులకు ఎలాంటి ఎలాంటి కలగకుండా రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసీసీ జిల్లా ఉపాధ్యక్షులు భగనరే మాధవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కంచం లక్ష్మణ్, జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ షేక్ ఇమామ్, తోకల రాజు, మాజీ జడ్పీటీసీ కుంరం చంద్రకళ రఘురాం, సొంపల్లి సర్పంచ్ లక్ష్మీకాంత్, కుంటాగూడ సర్పంచ్ మీరాబాయి-యాదవ్ రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రకాష్, మాజి అధ్యక్షులు షేక్ ఇమామ్, మైనారిటీ చైర్మన్ ఎండీ రంజాన్,కస్బె రామారావు,సందీప్, గజానంద్ ,సంజీవ్, రషీద్, బషీర్, కిసాన్ పటేల్ , ఎల్లయ్య,నర్సియ్య, తిరుపతి,పూసం సత్తి,మల్లేష్, నారాయణ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ముందస్తు వ్యాధి నిర్ధారణతో ప్రాణాలను కాపాడుకోవచ్చు

### జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**హనుమకొండ, ప్రతినిధి జూలై 4 (జనం సాక్షి) :** ఆరోగ్యపరంగా అధిక ప్రమాదం ఉన్న వర్గాల కోసం వైద్య ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న క్షయవ్యాధి అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పిలుపునిచ్చారు. శనివారం హసన్‌పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని భీమారం పాత గ్రామపంచాయతీ కార్యాలయ



ప్రాంగణంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన టీబీ, ఎన్‌సీడీ స్క్రీనింగ్ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి ఏర్పాట్లు, పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మదన్ మోహన్ రావు శిబిరం నిర్వహణ, అందిస్తున్న సేవలపై కలెక్టర్‌కు వివరించారు. 30 సంవత్సరాలు పైబడిన వారికి రక్తపోటు, మధుమేహం, నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లకు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టీబీ ముక్త్ భారత్ అభియాన్ లక్ష్యం దేశంలో క్షయవ్యాధి నిర్మూలనేనని తెలిపారు. టీబీ లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం అత్యాధునిక, ఖరీదైన చికిత్సను పూర్తిగా ఉచితంగా అందిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోహిత్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్ మోహన్ రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రదీప్ రెడ్డి, హసన్‌పర్తి తహసీల్దార్ కిరణ్ కుమార్, వైద్యాధికారులు డాక్టర్ భరత్, డాక్టర్ మానస, జిల్లా మాస్ మీడియా అధికారి వి. అశోక్ రెడ్డి, టీబీ యూనిట్ సిబ్బంది, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గోడ ఎప్పుడైనా కూలిపోవున్..

**వరంగల్ ఈస్ట్, జూలై 04 (జనం సాక్షి)** వరంగల్ నగరంలోని మట్టేవాడ పోలీస్ స్టేషన్‌కు ఆనుకొని ఉన్న గోడ ఎప్పుడైనా కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే గోడ సగం వరకు కూలిపోగా మిగతాది కూలే ప్రమాదం ఏర్పడింది. దీనికి ప్రధాన కారణం గోడ మధ్యలో మొలిచి పెద్దదైన వృక్షమే. పోలీస్ స్టేషన్ పక్కనే ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన ఈ గోడ అక్కడక్కడ శిథిలావస్థకు చేరిపోగా



తాజాగా ఈ గోడ మధ్యలో ఉన్నటువంటి వృక్షం వేర్ల వల్ల గోడ పూర్తిగా కూలిపోయే పరిస్థితి కనిపిస్తుంది. సంబంధిత ఇంటి యజమానులు పరిస్థితిని గమనించి తగిన చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు, పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రజలు కోరుతున్నారు.

# పిల్లల కోసం సేవా హస్తం..

### పాఠశాలకు స్టీల్ ప్లేట్లు విరాళంగా అందజేసిన రిటైర్డ్ హెచ్ఎం గంగాప్రసాద్



**భైంసా, జూలై 04, (జనంసాక్షి)** భైంసా మండలంలోని మహాగాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వారి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు రాచేవాడ్ గంగాప్రసాద్, రాచేవాడ్ పద్మావతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం 50 స్టీల్ ప్లేట్లను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనకరాజు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. కృష్ణతో పాటు ఉపాధ్యాయులు రాచేవాడ్ గంగాప్రసాద్ దంపతుల సేవాభావాన్ని అభినందించారు. విద్యార్థుల సంక్షేమం కోసం అందించిన ఈ విరాళం అభినందనీయమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న గంగాప్రసాద్ దంపతులకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

# వృద్ధురాలుకు అండగా నిలుస్తాం

### చైర్మన్ డా.జి. సంధ్యారాణి



**రామకృష్ణాపూర్, జులై04(జనంసాక్షి):** మున్సిపాలిటీలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 17వ వార్డుకు చెందిన వృద్ధ మహిళ పాశం భూధమ్మ ఇల్లు కూలిపోవడంతో మహిళకు అండగా నిలుస్తామని క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ డా.జి. సంధ్యారాణి హామీ ఇచ్చారు. వార్డులోని కూలిన ఇల్లును చెన్నూరు నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజారమేష్ తో కలిసి శనివారం పరిశీలించారు. ఎవరు లేని మహిళకు అండగా ఉండడంతో పాటు ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయించి ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. నాయకులు డాక్టర్ రాజారమేష్ మాట్లాడుతూ నిరుపేదరాలైన మహిళకు నీడ లేకుండా పోవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైనప్పటికీ ఇంటి నిర్మాణం కొరకు ముందస్తుగా కావలసిన ఆర్థిక సహాయాన్ని భూదమ్మకు అందజేస్తామని తెలిపారు. మహిళకు సహాయ సహకారాలు అందించడానికి ముందుకొచ్చిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట కౌన్సిలర్ బబ్బుర స్వర్ణలత, నాయకులు రామిడి కుమార్, లక్ష్మీకాంత్, మాజీ కౌన్సిలర్ ఉమాదేవి, స్థానికులు ఉన్నారు.

## కొండ రాజమ్మను సన్మానించిన గడ్డం క్రాంతి



**మల్హర్, జూలై 04( జనం సాక్షి)** ఇటీవల మలహార్ మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కొయ్యూర్ గ్రామ సర్పంచ్ కొండ రాజమ్మ ను పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. శనివారం ఆమె నివాసంలో చిన్నతూండ్ల సర్పంచ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డం క్రాంతి రణదేవ్ మరియు ఎడ్లపల్లి ఉప సర్పంచ్ వేల్పుల రమేష్ లు ఆమెకు శాలువా కప్పి, పూలమాల వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాజమ్మ నాయకత్వంలో మండలంలోని సర్పంచులందరి సమస్యల పరిష్కారానికి, మండల అభివృద్ధికి ఆమె శక్తివంచన లేకుండా కృషి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షురాలిగా ఎన్నికవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సన్మాన కార్యక్రమంలో కొయ్యూర్ మాజీ ఉప సర్పంచ్ కొండూరు మమత, వల్లెంకుంట గ్రామ శాఖ మాజీ అధ్యక్షులు, వార్డ్ సభ్యులు గడ్డం ప్రేమ్ కుమార్, తాడిచెర్ల యూత్ అధ్యక్షులు మేనం శ్రీనుతో పాటు పలువురు యువనాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వీడియో కాన్ఫరెన్స్‌కు గైర్హాజరైన అధికారులపై కలెక్టర్ ఆగ్రహం

### షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** వీడియో కాన్ఫరెన్స్‌కు గైర్హాజరైన అధికారులపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లా కలెక్టర్లు, జిల్లా అధికారులతో ప్రాధాన్యత అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారని సమావేశానికి సమగ్ర సమాచారంతో హాజరు కావాలని ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికి కొన్ని శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తీవ్రంగా మండిపడ్డారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ప్రాధాన్యతను తెలిపి, ముందస్తుగా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, విధుల్లో నిర్లక్ష్యం వహించడం వారి అసమర్ధతకు నిదర్శనమని, సమావేశానికి గైర్హాజరు అయిన సదరు అధికారులకు తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాలు, సమీక్షా సమావేశాల పట్ల అధికారుల అలసత్వాన్ని సహించేది లేదని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

## గుడుంబాపై పోలీసుల ఉక్కుపాదం

### 10 లీటర్ల గుడుంబా స్వాధీనం, 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం



**(పలిమేల జులై 4జనం సాక్షి )** జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు అక్రమ మద్యం తయారీ, విక్రయాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా భూపాలపల్లి జిల్లా పలిమెల పోలీస్ స్టేషన్ పరిధిలోని దమ్మూరు గ్రామంలో పోలీసులు గుడుంబాపై దాడి నిర్వహించారు. ఈ దాడిలో 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని, గుడుంబా తయారీకి సిద్ధంగా ఉంచిన 100 లీటర్ల బెల్లం పానకంను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అక్రమంగా గుడుంబా తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో ఎక్కడైనా గుడుంబా తయారీ లేదా విక్రయాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం...

### ఖరీఫ్ పెట్టుబడి సాయం విడుదలపై హర్షం వ్యక్తం చేసిన కాంగ్రెస్ శ్రేణులు



**మంగపేట, జులై 04(జనంసాక్షి)** రాష్ట్రంలో రైతాంగాన్ని ఆర్థికంగా ఆదుకుంటూ, వారిని రాజును చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడకుల అశోక్ సూచనల మేరకు, మంగపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఖరీఫ్ సాగు పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడంతో, మండల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, రెవెన్యూ శాఖ ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల చిత్రపటాలకు నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు మైల జయరామ్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ తోట రమేష్, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, బీసీ సెల్ నాయకులు పెద్ది నరసింహారావు, పూజారి సురేందర్, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, యర్రంగారి సురేష్, అనుబంధ సంఘాల జిల్లా, మండల స్థాయి అధ్యక్షులు, నియోజకవర్గ, బ్లాక్, మండల, గ్రామస్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలు నేటి తరానికి ఆదర్శం..

### జిల్లా కలెక్టర్ -చాహత్ బాజ్ పాయ్



**హనుమకొండ, ప్రతినిధి జూలై 4 (జనం సాక్షి) :** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం, ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని శనివారం జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెట్టిచాకిరీ, సామాజిక దోపిడీ, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన దొడ్డి కొమురయ్య తెలంగాణ ప్రజల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, న్యాయం, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన త్యాగాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తెలంగాణ చరిత్రలో రైతాంగ సాయుధ పోరాటానికి దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం చిరస్థాయిగా నిలిచిపోతుందని, మహనీయుల ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ ఆఫీసర్ పోస్టునకు దరఖాస్తులు ఆహ్వానం

### జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రవి రాథోడ్



**మహబూబాబాద్ బ్యూరో, జూలై.04(జనం సాక్షి):** జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో మహబూబాబాద్ బస్తి దవాఖానలో కాంట్రాక్ట్ పద్ధతిలో మెడికల్ ఆఫీసర్ ఒక (01) ఖాళీ పోస్టును భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రవి రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు . అభ్యర్థులు ఎంబిబిఎస్ డిగ్రీ, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ అర్హత కలిగి ఉండాలని దరఖాస్తు నమూనా మరియు మార్గదర్శకాలను జిల్లా అధికారిక వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చునని పూర్తిగా నింపిన దరఖాస్తును అవసరమైన ధృవపత్రాల ప్రతులతో ఈ నెల06 నుండి 09 వరకు కార్యాలయ పని దినాలలో కలెక్టరేట్ లోని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం, మహబూబాబాద్ లో సమర్పించవలెనని తెలిపారు. దరఖాస్తుతో పాటు అవసరమైన అన్ని ధృవపత్రాల ప్రతులను తప్పనిసరిగా జతచేయాలని. డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా ఓసి అభ్యర్థులు 500 రూ, బిసి, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 300 రూ దరఖాస్తుతో పాటు తప్పనిసరిగా సమర్పించవలెనని దరఖాస్తుల స్వీకరణ సమయం అనంతరం సమర్పించే ధృవపత్రాలు పరిగణనలోకి తీసుకోబడవని అధికారి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## 7న తండాల్లో సీత్ల పండుగను ఘనంగా నిర్వహించాలి



**చెన్నారావుపేట, జులై 4 ( జనం సాక్షి):** ఈనెల 7న మంగళవారం గ్రామాలలోని గిరిజన తండాల్లో సీత్ల పండుగను ఘనంగా నిర్వహించాలని గిరిజన జేఏసీ మండల కమిటీ అధ్యక్షులు బోడ మురళి నాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనుల ఐక్యతే మన బలం అని సంస్కృతి పరిరక్షణే మన బాధ్యత అని తెలిపారు. ప్రతి ఇంట ఆనందం, ప్రతి మనసులో ఐక్యత ఉండాలని తండాలలోని గిరిజనులంతా మన సంస్కృతిని కాపాడుకుంటూ గిరిజన అస్తిత్వాన్ని చాటుకుందామన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సీత్ల మాత ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ఈ నెల 07న మంగళవారం చెన్నారావుపేట మండలంలోని అన్ని గిరిజన తండాల్లో సీత్ల పండుగను ఒకేసారి, ఐక్యంగా, అత్యంత ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీత్ల పండుగ అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదని అది గిరిజనుల సంస్కృతి, సంప్రదాయం, ఐక్యత, ఆత్మగౌరవానికి ప్రతీక అని కొనియాడారు. మన పూర్వీకులు మనకందించిన ఈ గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూ భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు. చెన్నారావుపేట మండలంలోని గిరిజన సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు, యువత, మహిళలు, ప్రజాప్రతినిధులు, ప్రతి గిరిజన కుటుంబం ఈ సీత్ల పండుగలో భాగస్వాములు కావాలని కోరారు. తమ తమ తండాల్లో భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాల నడుమ సీత్ల పండుగను విజయవంతం చేయాలని కోరారు.

## కడియం నాయకత్వంలో కళాశాలల అభివృద్ధి

**ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలను సందర్శించిన మున్సిపల్ చైర్మన్ వినయ్**

**స్టేషన్ ఘన్‌పూర్, జూలై 04 ( జనం సాక్షి ) :** స్టేషన్ ఘన్పూర్ మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో ని శివుని పెల్లిలో గల ప్రభుత్వ ఇంటర్,డిగ్రీ కళాశా లలు మాజీ ఉప ముఖ్యమంత్రి,ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య నాయకత్వం లో అన్ని విధాల అభివృద్ధి చెందుతాయని మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలో ని శివుని పెల్లిలో గల ప్రభుత్వ ఇంటర్,డిగ్రీ కళాశాలలను మున్సిపల్ చైర్మన్ వినయ్ కుమార్ సందర్శించా రు. కాలేజీలో ఉన్న సమస్యలు ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ వినయ్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నాయకత్వంలో ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాలలో గల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. విద్యార్థులు చెడు వ్యస నాలకు లోను కాకుండా క్రమ శిక్షణ తో చదివి మంచి ప్రయోజకులు కావాలని అన్నారు. ఈ కార్య క్రమంలో కౌన్సిలర్లు పొన్న రవి, హరినాథ్, నాయకులు గట్టు రమేష్, పెసరు సారయ్య, తోక ల రాజు తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసా నిధులు విడుదల చేసినందుకు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



**తరిగొప్పుల (జనంసాక్షి) :** జనగామ నియోజకవర్గ పరిధిలోని రైతుల పక్షాన రైతు భరోసా నిధులు విడుదల చేసినందుకు గాను తెలంగాణ రాష్ట్ర టి పి సి సి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, జనగామ నియోజకవర్గ ఇన్చార్జ్ మాజీ శాసనసభ్యులు కొమ్మూరి ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో, జనగామ కేంద్రంలోని కొమ్మూరి ఆఫీస్ నందు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు అనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైనటువంటి తరిగొప్పుల మండల అధ్యక్షులు వగలబోయిన యాదగిరి ను కాంగ్రెస్ పార్టీ జనగామ ఇన్చార్జ్ ప్రతాపరెడ్డి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలపడం జరిగినది, అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండో విడుదలో భాగంగా మంజూరు చేస్తున్నటువంటి ఇందిరమ్మ ఇండ్ల గురించి, మండల కేంద్రానికి మంజూరైనటువంటి ఇండ్ల గురించి మాట్లాడుతూ తరిగొప్పుల మండల కేంద్రం ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గా ప్రజల అధికంగా ఉంటున్న మండలం వలన మంజూరైనటువంటి ఇండ్లు సరిపోవనందున, మండల కేంద్రానికి మరికొన్ని ఇండ్లు మంజూరు చేయవలసిందని కోరడం జరిగినది, ఈ విషయమై కొమ్మూరి ప్రతాప రెడ్డి గారు స్పందించి తరిగొప్పుల మండల కేంద్రానికి మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం జరిగినది . ఈ కార్యక్రమంలో తరిగొప్పుల మండల అధ్యక్షులు , వగలబోయిన యాదగిరి గౌడ్ మరియు తరిగొప్పుల గ్రామ శాఖ అధ్యక్షులు పండుగ కనుకయ్య, తరిగొప్పుల మండల మాజీ ప్రధాన కార్యదర్శి పింగిలి ఇంద్రారెడ్డి, తరిగొప్పుల మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎడ్ల నవీన్ కుమార్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## బల్మూరి అంటేనే భరోసా

**రెండు లక్షల ఎల్ఓసి మంజూరు**

కమలాపూర్, జూలై 04 (జనం సాక్షి) : హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త తాటికంటి రమేష్ భార్య సరిత గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. వైద్య ఖర్చులకు డబ్బులు సరిపోక క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఆ కుటుంబం ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరి వెంకట్ ని ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న వెంటనే ఆలస్యం చేయకుండా సీఎం కార్యాలయంతో మాట్లాడి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి తక్షణమే చికిత్స నిమిత్తం రెండు లక్షల రూపాయల ఎల్ఓసి ని మంజూరు చేయించారు. పదవులు ఉన్నా లేకున్నా నిత్యం ప్రజల్లో ఉంటూ, బడుగు బలహీన వర్గాల వారికి ఎలాంటి కష్టం వచ్చినా ముందుండి ఆదుకునే వ్యక్తి బల్మూరి వెంకట్ అని పేర్కొన్నారు. కష్ట కాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచి, ప్రాణదానం చేసిన డాక్టర్ బల్మూరి వెంకట్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## జిల్లా సర్పంచుల ఫోరం కోశాధికారిగా మందపల్లి మరియా ప్రసాద్ ఏకగ్రీవ ఎన్నిక



**ఆత్మకూర్, జూలై 4 (జనం సాక్షి):** హనుమకొండ జిల్లా భీమారం జగతి కన్వెన్షన్ హాల్లో జిల్లా సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్పంచుల చైతన్య సదస్సు ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు చల్లా రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం పెంచికలపేట గ్రామ సర్పంచ్ మందపల్లి మరియా ప్రసాద్‌ను హనుమకొండ జిల్లా సర్పంచుల ఫోరం జిల్లా కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మరియా ప్రసాద్ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కోశాధికారిగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు. జిల్లాలోని సర్పంచుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని, గ్రామ పంచాయతీల అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, సర్పంచుల హక్కుల పరిరక్షణ కోసం జిల్లా సర్పంచుల ఫోరం తరఫున అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. సర్పంచులందరూ ఐక్యంగా ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తనను జిల్లా కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న జిల్లా అధ్యక్షుడు చల్లా రాకేష్ రెడ్డి, జిల్లా ఫోరం నాయకులు, సర్పంచులందరికీ మరియా ప్రసాద్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.





## కొయ్యూరు ఎస్ఐకి సన్మానం

**మల్హర్, జూలై 04( జనం సాక్షి):** మండలం కొయ్యూర్ పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కొయ్యూరు ఎస్ఐ మహేందర్ కుమార్ ను చిన్నతుండ్ల గ్రామ సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు గడ్డం క్రాంతి రణదేవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మహేందర్ కుమార్ కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా శాన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ఎడ్లపల్లి ఉపసర్పంచ్ వేల్పుల రమేష్, వల్లెంకుంట మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు గడ్డం ప్రేమ్ కుమార్, తాడిచర్ల బూత్ అధ్యక్షులు శ్రీను పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

**కాళేశ్వరం , జూలై 4 (జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పోలీసు సేవలను మరింత మెరుగుపరిచే దిశగా జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ శనివారం కాళేశ్వరం పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు ప్రజల ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించి, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించేలా పనిచేయాలని సిబ్బందికి ఆదేశించారు.

## వర్షాకాలంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలి

**ఎస్పై టివిఆర్ సూరి**



**మంగపేట, జూలై 4 (జనంసాక్షి) :** రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, మంగపేట మండల ప్రజలు ప్రాణాపాయం నుండి రక్షించుకునేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని స్థానిక ఎస్పై టివిఆర్ సూరి గారు కోరారు. ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం రంగంలోకి దిగింది అని వర్షాల వల్ల తలెత్తే విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడానికి ప్రజలు ఈ క్రింది సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా వర్షాల వల్ల తడిచిన కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు లేదా తెగిపడిన విద్యుత్ తీగలను పొరపాటున కూడా తాకవద్దు అని శిథిలావస్థలో ఉన్న ఇళ్లు లేదా పాత భవనాల్లో నివసిస్తున్న వారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు లేదా పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలి అని సూచించారు. వర్షం పడుతున్నప్పుడు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు అని ఒకవేళ బయటకు రావాల్సి వస్తే, ముందుగానే వాతావరణ పరిస్థితులను గమనించుకోవాలి అని కోరారు. ముఖ్యంగా ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, కాలువలను దాటే ప్రయత్నం చేయరాదు, వంతెనల మీద నీరు ప్రవహిస్తున్నప్పుడు వాహనాలను తీసుకెళ్లడం అత్యంత ప్రమాదకరం, వర్షాకాలంలో రోడ్లు జారుడుగా ఉంటాయి. వాహనాలను వేగంగా నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది కాబట్టి, పరిమిత వేగంతో ప్రయాణించాలి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల ప్రాణాలను కాపాడుకోవడమే మన మొదటి బాధ్యత అని ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ, స్థానిక పోలీసులకు సహకరించాలి అని కోరారు. ఎటువంటి అత్యవసర సహాయం కావాలన్నా వెంటనే పోలీసులను సంప్రదించండి అని ఎస్పై టివిఆర్ సూరి వెల్లడించారు. మండలంలో ఎక్కడైనా ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని, తద్వారా తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలందరూ బాధ్యతగా ఉందాం అని ప్రమాదాలను అరికడదాం అని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

## దొడ్డి కొమురయ్య ఆశయాలను భావితరాలను చాటి చెప్పాలి



**గూడూరు, జులై04 (జనంసాక్షి):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య ఆశయాలను భావి తరాలకు చాటి చెప్పాలని గూడూరు మెజార్ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ అన్నారు. శనివారం గూడూరు మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య 80వ,వర్ధంతి వేడుకలను విగ్రహ కమిటీ అధ్యక్షులు కుండే కిషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా మానుకోట జిల్లా కుర్మ సంఘం అధ్యక్షులు చీర అశోక్ హాజరైనారు.అనంతరం దొడ్డి కొమురయ్య కమిటీ ఆధ్వర్యంలో విగ్రహానికి పూలమాలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈసందర్భంగా గూడూరు మెజార్ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ మాట్లాడారు.దొడ్డి కొమురయ్య అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని,ఆయన సేవలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. ఆయన త్యాగం తెలంగాణ ప్రజలకు స్ఫూర్తిదాయకమని, సామాజిక న్యాయం,రైతుల హక్కుల కోసం చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో గూడూరు మెజార్ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ దంపతులను శాలువాతో ఘనంగా సత్కారించినారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షులు మండల ఉపేందర్,గూడూరు మెజార్ సర్పంచ్ రిటైర్డ్ ఎంఈఓ చీర బిక్షపతి,వైస్ ఎంపీపీ అరె వీరన్న, మాజీ సర్పంచ్ నునావత్ రమేష్ నాయక్, చీరబోయిన కుమార్, చెల్పూరి వెంకన్న,గుండెబోయిన మల్లేష్ యాదవ్, నూకల ఉపేందర్,మండల శ్రీనివాస్, సురేందర్, కన్నెబోయిన వెంకన్న,మండల కొమురయ్య, మంగ చేరాలు,కుండే బీరయ్య,దూడ మల్లయ్య, మండల సుధాకర్,గ్రామ అధ్యక్షులు కర్రె యాకయ్య,కోరే కుమారస్వామి,కుండే పవన్, కాలే కుమారస్వామి,కోరే దేవేందర్,చౌట చేరాలు, మంగ కుమారస్వామి, దయ్యల అనిల్,పోతరాజు రవి కుర్మ,మంగ కుమారస్వామి,మంగ లక్ష్మన్, తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ బంకులో పేరుకుపోయిన బకాయిలను వెంటనే వసూలు చేయాలి

**చెన్నారావుపేట సొసైటీ సీఈఓ కు వినతి...**



**చెన్నారావుపేట, జూలై 4 ( జనం సాక్షి):** చెన్నారావుపేట సొసైటీకి సంబంధించిన బంకులో బకాయిలు పేరుకు పోయాయని వెంటనే వాటిని వసూలు చేయాలని చెన్నారా వుపేట గ్రామ రైతు, మాజీ సైనికుడు నన్నెబోయిన రమేష్ యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం సొసైటీ సీఈఓ చిట్టె రవికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నారావుపేట సొసైటీకి సంబంధించిన బంకులో డీజిల్, పెట్రోల్ పేరిట లక్షల రూపాయల బకాయిలు పేరుకుపోయాయని వెంటనే పేరుకుపోయిన బకాయిలను వసూలు చేయాలన్నారు. బకాయిలను వసూలు చేయడంలో గత పాలకవర్గం నిర్లక్ష్యం చేసిందని నూతన పాలకవర్గ సభ్యులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పేరుకుపోయిన బకాయిలను వెంటనే వసూలు చేయాలన్నారు. అంతేకాక వర్షాకాలం ప్రారంభమైందని సొసైటీ పరిధిలోని గ్రామాల రైతులకు జీలుగ విత్తనాలు, యూరియా, ఇతర విత్తనాలను సరిపడా అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు.